క్లుప్తంగా

గొర్రెల పంపిణీ



లబ్ధిదారులకు గొర్రెలు అందజేస్తున్న జెడ్పీటీసీ రామారావు

దహెగాం: మండలంలోని చంద్రపల్లిలో లబ్ధిదారులకు జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు బుధవారం గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లకుర్మలు ఆర్థికాభివృద్ధి చెందాలని ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రెండో విడతలో 6 యూనిట్లు 126 గొర్రెలు, 6 పొట్టేళ్లు అందించిందని తెలిపారు. అదేవిధంగా గొర్రెలకు సంబంధించి బీమాపత్రాలు వారికి అందజేశారు. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సురేష్, సర్పంచ్ లగ్గామ దామోదర్, పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకేంద్రానికి వివిధ పనుల నిమిత్తం మండలాల ప్రజలు వస్తుంటారని అన్నారు. ఇక్కడ పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మహిళలు పడరాని అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవచూపి పబ్లిక్ టాయిలెట్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు దుర్గం రాజ్‌కుమార్, టీకానంద్, నిఖిల్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు సర్పంచ్ దుర్గం రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్ బుధవారం పౌష్టికాహారం పంపంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ శకుంతల, హెల్పర్ హంస తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలు సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న సర్పంచ్

దహెగాం: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని బీబ్రా సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రం తోపాటు, బీబ్రా రైతు వేదికల ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఏఈవోలు వెన్నెల, శోభన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ప్రతీనెల చివరి బుధవారం ఈ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. అర్చకుడు నగేష్ స్వామి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శులు శ్రీమంతుల వేణుగోపాల్, వెంకట్‌గౌడ్, కోశాధికారి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు బాబుగౌడ్, కమిటీ సభ్యులు సంతోష్, మడావి శ్రీనివాస్, శ్యాం, ఆశిష్, శ్రీనివాస్‌గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో సలహాలు పాటించాలి

బెజ్జూర్: పంట సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏడీఏ రాజుల నాయుడు అన్నారు. మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో వరి, పత్తి పంటల్లో సమగ్ర సస్యరక్షణపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగు విషయంలో ఏవైన సందేహాలు ఉంటే అధికారులు దృష్టికి తేవాలన్నారు. పురుగుల మందు, యూరియాను మోతాదుకు మించి వాడొద్దని సూచించారు. ఏఈవో శ్రీధర్, సర్పంచ్ వడ్డేపల్లి లావణ్య, శ్రీనివాస్, గడ్డం రాజేష్ పాల్గొన్నారు.

కొందరికే ‘పోడు’

- అడ్డంకిగా మారిన ప్రభుత్వ నిబంధనలు
- 2008కి ముందు ఎస్టీలు గ్రామంలో ఉండాలనే షరతు
- పత్రాలు, పట్టాలతో కొందరు రైతుల దరఖాస్తు
- నిబంధనల సాకుతో తిరస్కరణ



పోడుపట్టాలు అందని మన్నెగూడ ఆదివాసీలు

రెబ్బెన: ఏళ్లుగా పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందించాలని ప్రభుత్వం ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. ఆసిఫాబాద్ నుంచి పోడు పట్టాల పంపిణీ ప్రక్రియను ప్రారంభించింది. అర్హులందరికీ పట్టాలు ఇవ్వకుండా అధికారులు కొందరికే అందించి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వ నిబంధనలు అడ్డంకి మారాయి. ఎస్టీలు 2008కి ముందు నుంచి అదే గ్రామంలో నివాసం ఉంటున్నట్లు పత్రాలు సమర్పించాలని పేర్కొంది. ఇందులో కొందరు రైతులు ధ్రువపత్రాలతో పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సరిగ్గా లేని కారణంగా నిబంధనల సాకుతో అధికారులు తిరస్కరించారు. దీంతో ఆదివాసీలు, గిరిజనులు భూములకు దూరం కావల్సిన పరిస్థితి. తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు.

9 మందికే పట్టాలు

మండలంలోని నంబాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. గ్రామశివారులోని అటవీ భూమిలో కొందరు తాతలు తండ్రుల కాలం నుంచి, మరికొందరు రెండు దశాబ్దాల క్రితం నుంచే పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివాసీలు, గిరిజనుల సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా దరఖాస్తులు స్వీకరించింది. కార్యదర్శులు, అటవీశాఖ అధికారులు పోడు సర్వే చేశారు. దాదాపు 60 మంది రైతులు పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనలు సాకుగా చూపి అధికారులు చాలా వాటిని తిరస్కరించారు. మిగిలిన వారి వివరాలు, సాగు విస్తీర్ణం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కేవలం 9 మందికి మాత్రమే పోడు పట్టాలు అందాయి.

అడ్డుకున్న అటవీ అధికారులు

నంబాలలోని మన్నెగూడలో నివాసం ఉండే ఆదివాసీ గిరిజనులు పోడు భూముల్లో సాగు చేసుకుంటున్నారు. పట్టాలు లేకపోవడంతో సాగు చేపట్టకుండా అటవీశాఖ అధికారులు వారిని అడ్డుకున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలోనూ అధికారులతో ఘర్షణ పడి పత్తి, కంది, పెసర తదితర సాగు చేపట్టారు. అయితే అధికారులు మళ్లీ ఏం చేస్తారోనని భయపడుతున్నారు. ప్రభుత్వం పోడు పట్టాలు అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సర్వే చేసిండ్రు



ఎన్నో ఏండ్ల సంది చేసుకుంటున్న భూమికి పోడు పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే సార్లు అచ్చి సర్వే చేసిండ్లు. సాగు చేసే భూమి హద్దులు చూపించినం. ఆ తరువాత ఏమైందో తెల్వదు. మాకు అయిన పోడు పట్టా రాలే. ఎవ్వరిని అడిగిన పట్టా ఎందుకు రావటం లేదో చెప్పటం లేదు.

– టేకం గౌరుబాయి

పట్టా రాలేదు



నంబాల శివారులోని పోడు భూమిలో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. పట్టాల కోసం ఇచ్చిన దరఖాస్తులో అన్ని పత్రాలు ఇచ్చినం. అయిన మాకు పట్టాలు రాలేదు. సార్లను కలుస్తున్నా పట్టించుకోవడం లేదు.

– ఆత్రం కొండయ్య

మాకు న్యాయం చేయాలే



నంబాలలో 9 మందికి పోడు పట్టాలు అచ్చినయి. దాదాపు 50 మందికి పట్టాలు రాలె. ఫారెస్టు సార్లు పోడు భూమిలో పంటలు వేసు కోనివ్వట్లేదు. ఆ భూమి తప్పా మాకు మరే భూమి లేదు. పట్టాలు అందించి న్యాయం జరిగేలా చూడాలె.

– సిడాం నాదక్క

విద్యార్థినికి ఆర్థికసాయం



స్రవంతికి ఆర్థికసాయం అందిస్తున్న సింగరేణి అధికారులు

దహెగాం: మండలంలోని చంద్రపల్లికి చెందిన సంగర్ష్ స్రవంతి నీట్‌లో మంచి ర్యాంకు సాధించి కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కాలేజీలో సీటు పొందింది. ఆమె చిన్నతనంలో తండ్రి మృతి చెందగా, తల్లి కూలీ పనులు చేసుకుంటూ స్రవంతిని చదివించింది. ప్రస్తుతం ఆమె హాస్టల్ ఫీజు, ఇతర ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది ఉంది. ఈ విషయం తెలుసుకున్న కారెపల్లి ఎస్సై రామారావు స్పందించి సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేము రాజు దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణి అధికారులు ముందుకు వచ్చి జీఎం కార్యాలయంలో విద్యార్థినికి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. అదేవిధంగా ఇల్లందు ఏరియా సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి రూ.10 వేలు, కొత్తగూడెం ఏరియా సెక్యూరిటీ అధికారి రమణారెడ్డి రూ.5 వేల నగదు అందజేశారు. స్రవంతిని అన్ని విధాల ఆదుకుంటామని జీఎం తెలిపారు.

ధర్నా విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద శుక్రవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు కోరారు. జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులతో కలిసి ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ ధర్నాకు ఉపాధ్యాయులు, నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు హేమంత్ షిండే, ఉపేందర్, నరేందర్, శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం

కెరమెరి: మండలంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బలిరాం బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌డబ్ల్యూవో వసంత్‌రావు, సీఆర్టీలు మోహన్, ప్రవీణ్, రవి, పృథ్వీరాజ్ మీనాక్షి, అరుణ, ఏఎన్‌ఎం మంగుబాయి ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



చెక్కులు అందజేస్తున్న అధికారులు

కౌటాల: మహిళలు ఆర్థికంగా ఎదగాలని టీజీబీ ఆర్‌బీవో డి శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని ముత్తంపేట టీజీబీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు బుధవారం రూ.కోటి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందాలని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించనప్పుడే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం అన్నాజీ, ఏపీఎం వెంకటరమణ, బ్యాంకు అధికారులు అజేశ్‌కుమార్, నరసింహ, అనిల్, సంఘం మండల అధ్యక్షులు మీరా, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి వాసికి ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వెడ్మ శంకర్

తిర్యాణి: మండలంలోని ఎదులపహాడ్ గ్రామానికి చెందిన వెడ్మ శంకర్‌కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతిభా పురస్కారం దక్కింది. 2021 సంవత్సరానికి సంబంధించి జానపద కళారంగం విభాగంలో శంకర్ ఎంపిక కాగా, బుధవారం హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీలో వీసీ కిషన్‌రావు చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా వెడ్మ శంకర్ ‘సాక్షి’తో మాట్లాడుతూ ఈ పురస్కారం ఆదివాసీ కళలకు మరింత జీవం పోస్తుందన్నారు. తన ప్రతిభ గుర్తించి పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

జ్వరంతో ఇద్దరు మృతి



చౌదరి మమత (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన చౌదరి మమత(24) బుధవారం జ్వరంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రెండురోజుల క్రితం జ్వరం రావడంతో మమత స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందింది. ఎంతకీ తగ్గకపోవడంతో కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలికి భర్త రవి, కుమార్తె ఇందు, కుమారుడు చరణ్ ఉన్నారు.



భీంరావు (ఫైల్)

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ పంచాయతీలోని నందికొండ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కొద్దని భీంరావ్ మంగళవారం జ్వరంతో మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. భీంరావు గతకొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గలేదు. కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఆరోగ్యం కుదుటపడడంతో ఇంటికి తీసుకురాగా మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, కుమారుడు శివ, కుమార్తె షెర్లీ ఉన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై పార్టీల నాయకులతో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా పంచాయతీల్లో కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలు చేపట్టినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిచూసుకోవాలన్నారు. సెప్టెంబర్ 2,3 తేదీల్లో ఓటరు నమోదుతోపాటు మార్పులు, చేర్పులకు అభ్యంతరాలు స్వీకరించడానికి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డీటీ సరిత, పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా తయారీ, తప్పుల సవరణ తదితర అంశాలపై పార్టీల నాయకులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు.

‘గెలుపే లక్ష్యంగా పని చేస్తాం’

నార్నూర్: కాంగ్రెస్ టికెట్ ఎవరికీ వచ్చినా.. గెలిపే లక్ష్యంగా పని చేస్తామని కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా అజ్మీరా శ్యాంనాయక్ మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకే ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయంలోకి వచ్చానని అన్నారు. పార్టీ ఎటువంటి బాధ్యతలు అప్పగించిన చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలిచి అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యునుస్‌ఖాన్, లోఖండే దేవురావు, కైలాస్ జాదవ్, డిగాంబర్ చౌహాన్, కరీంఖాన్, జాకురుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు



కౌటాల: భారతీ విద్యామందిర్ పాఠశాలలో..



కౌటాల: ముత్తంపేట్ పాఠశాలలో..



రెబ్బెనలో..

- రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థినులు

కౌటాల/రెబ్బెన/కెరమెరి: పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. కౌటాల మండలంలోని ముత్తంపేట్ ప్రాథమిక, కౌటాల భారతీ విద్యామందిర్ పాఠశాలల విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ఎస్సై ఎస్.మధుకర్‌కు స్థానిక వాహిని పాఠశాల విద్యార్థినులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కెరమెరి మండలం మోడి కేజీబీవీలో జెడ్పీటీసీ దుర్పతబాయి బాలికలకు రాఖీలు కట్టి తానున్నానని భరోసానిచ్చారు. ఎస్‌వో మీనా కుమారి ఉన్నారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్టుకు రాఖీ కట్టారు. పాఠశాల ఆవరణలో చెట్లకు రాఖీలు కట్టి వాటి రక్షణపై ప్రతినబూనారు. అనంతరం బాలురకు రాఖీ కట్టారు. విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం నల్లగొండ రమేశ్, టీచర్ ప్రవీణ్ ఉన్నారు. రెబ్బెన మండలంలోని పులికుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టారు. అనంతరం డీఈవో అశోక్‌కు బస్‌డిపో మేనేజర్ శ్రీధర్, పోలీసు కానిస్టేబుల్, ఆసుపత్రిలో యువత, వ్యాపారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కౌటాల ఎస్సైకి రాఖీ కడుతున్న విద్యారినులు



కెరమెరి: రాఖీ కడుతున్న జెడ్పీటీసీ దుర్పతబాయి



చెట్టుకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



దీఈవో అశోక్‌కు రాఖీ కడుతున్న విద్యార్థులు



కెరమెరి: రాఖీ ఆకారంలో బాలికలు

రాఖీ సందడి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలో రాఖీ పౌర్ణమి సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి మహిళలు బుధవారం రాఖీలను కొనుగోలు చేశారు. వివిధ డిజైన్ల ఉన్న రాఖీలకు గిరాకీ ఉంది. విద్యార్థినులు, చిన్నారులకు నచ్చిన రాఖీలను కొనుగోలు చేశారు.





డబ్బా పంచాయతీలో అవినీతిపై ఫిర్యాదు



ఫిర్యాదు పత్రంతో గ్రామస్తుడు జుమిడి సాగర్

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా పంచాయతీలో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్తుడు జుమిడి సాగర్ బుధవారం ఫిర్యాదు చేశారు. డబ్బా పంచాయతీలో 2018 నుంచి 2023 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఆడిట్‌లో ఎలాంటి అవినీతి జరగకుండా పారదర్శకంగా సమగ్ర వివరాలతో నిర్వహించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.